సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

నాడు కళకళ.. నేడు వెలవెల


మహిళా ప్రాంగణం స్థలంలో నిర్మించిన హుద్‌హుద్ గృహాలు, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ భవనం


పిచ్చి మొక్కలతో కూడిన ఖాళీ స్థలం


పైనాపిల్ కాలనీలో నిర్వహిస్తున్న జిల్లా మహిళా సాధికారత కేంద్రం (మహిళా ప్రాంగణం)



ప్రాంగణంలో నిరుపయోగంగా క్వార్టర్స్, చుట్టూ పిచ్చి మొక్కలు

జిల్లా మహిళా ప్రాంగణం రానురాను ఉనికి కోల్పోతోంది. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం నీడలో కొట్టుమిట్టాడుతోంది. మహిళలకు నిరంతరం చేతివృత్తుల్లో శిక్షణ అందించి చేయూతనిచ్చే ఈ ప్రాంగణం ఇప్పుడు అరకొర శిక్షణలతో బోసిపోతోంది. ఎకరాల కొలది విస్తీర్ణం గల ఈ ప్రాంగణం ఇప్పుడు కుదించుకుపోయింది. ప్రతి ఏటా వివిధ చేతి వృత్తుల్లో ఉచితంగా శిక్షణ పొందిన వేల మంది మహిళలతో ఈ ప్రాంగణం కళకళలాడేది. తరచూ శిక్షణలు జరగకపోవడంతో దీని ఆవరణం పిచ్చి మొక్కలతో నిండిపోయింది. సిబ్బంది కోసం నిర్మించిన క్వార్టర్స్ శిథిలావస్థకు చేరాయి. పూలతోటలు, వివిధ రకాల కూరగాయల పంటలతో పచ్చగా ఉండే ఈ ప్రాంగణం ఇప్పుడు దట్టమైన పిచ్చి మొక్కలతో అస్తవ్యస్తంగా మారింది.

- ఆరిలోవ

- ఉనికి కోల్పోతున్న జిల్లా మహిళా ప్రాంగణం
- పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో ఈ దుస్థితి
- ఇక్కడ వేల మంది మహిళలు చేతివృత్తుల్లో శిక్షణ పొందేవారు
- ఇప్పుడు భారీగా తగ్గిన శిక్షణలు
- పిచ్చి మొక్కలతో అస్తవ్యస్తంగా మారిన పరిసరాలు

జీవీఎంసీ 13వ వార్డు పైనాపిల్ కాలనీలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం (మహిళా ప్రాంగణం) నిర్వహిస్తున్నారు. 1987లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి జిల్లాలో మహిళా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా అప్పటి ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు పైనాపిల్ కాలనీలో నిర్వహిస్తున్న ఈ కేంద్రంలో వేల మంది మహిళలు పలు చేతివృత్తుల్లో శిక్షణ పొందారు. ఉమ్మడి విశాఖ జిల్లాల్లోని గిరిజన, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళలకు వివిధ చేతివృత్తులకు సంబంధించిన ఉచితంగా శిక్షణలు ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నిత్యం శిక్షణలు జరుగుతుండటంతో ఈ ప్రాంగణం మహిళలతో కళకళలాడేది. ఇప్పుడు ఇక్కడ ఆ కళ కరువైంది. అరకొరగా జరుగుతున్న శిక్షణలతో మహిళలు లేక ఈ ప్రాంగణం వెలవెలబోతోంది. సుమారు ఎనిమిదేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. దీనికి కేటాయించిన స్థలం కూడా తగ్గిపోయింది. వివిధ కార్యకలాపాలకు కేటాయించడంతో స్థలం ప్రస్తుతం సగానికి తగ్గింది.

అరకొర శిక్షణలు..

సుమారు ఎనిమిదేళ్లుగా మహిళా ప్రాంగణంలో ఏడాదికి నాలుగైదు బ్యాచ్‌లకు మాత్రమే శిక్షణలు జరుగుతున్నాయి. ఇక్కడ మహిళలకు బ్యూటీషియన్, టైలరింగ్, నర్సింగ్, మగ్గం వర్క్, బేసింగ్ సూయింగ్ తదితర వాటిలో శిక్షణ ఇవ్వడంతోపాటు కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్, ఆశా వర్కర్లకు మెడికల్ అండ్ హెల్త్‌కు సంబంధించి ఓరియంటేషన్ తరగతులు తదితర విభాగాలలో శిక్షణలు ఇస్తుంటారు. దీనిలో గిరిజన, గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి ఇంతవరకు సుమారు 50 వేల మందికి పైగా మహిళలు శిక్షణ పొందారు. వారికి నెల, మూడు నెలలు కోర్సులు బ్యాచ్‌ల వారీగా నిర్వహించేవారు. ఇక్కడ శిక్షణ పొందిన అనంతరం వారు స్వయం ఉపాధి సాధించడం, ఉద్యోగాల్లో చేరడం జరుగుతుండేది. ప్రభుత్వ సంస్థలు, డీఆర్‌డీఏ తదితర సంస్థలు ఈ ప్రాంగణంలో శిక్షణలు నిర్వహించేవి. వారు బ్యాచ్‌ల వారీగా ప్రాంగణానికి కొంత రుసుం చెల్లించేవారు. ఇప్పుడా శిక్షణలు తగ్గిపోవడంతోపాటు ఆదాయమూ లేదు. ప్రస్తుతం ఇక్కడ ఆశా వర్కర్లకు వారం రోజుల చొప్పున శిక్షణలు జరుగుతున్నాయి.

మిగిలింది 6.7 ఎకరాలు..

ఈ ప్రాంగణానికి 1987లో రాష్ట్ర ప్రభుత్వం 11.6 ఎకరాల స్థలం కేటాయించింది. దీనిలో బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మాణంలో 2.8 ఎకరాలు పోయింది. మిగిలిన దానిలో మరో 2.1 ఎకరాల స్థలంలో ఆరేళ్ల కిందట హుద్‌హుద్ నివాసాలు నిర్మించేశారు. దీంతో ప్రస్తుతం 6.7 ఎకరాలు మాత్రమే స్థలం మిగిలింది. దీనిలోనే సుమారు మరో అరెకరం స్థలంలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మించారు. దానిలో వర్కింగ్ ఉమెన్స్ ఎవ్వరూ చేరకపోవడంతో సుమారు నాలుగేళ్లుగా ఖాళీగా ఉండిపోయింది. ప్రస్తుతం దీన్ని స్వదార్ గృహంగా వినియోగించుకుంటున్నారు. ఇంత పెద్ద భవనంలో నలుగురు అనాథలకు మాత్రమే ఆశ్రయం కల్పిస్తున్నారు. మహిళా ప్రాంగణం పాత భవనంలోనే కొన్ని గదులను ఏడాది క్రితం నుంచి మాతా శిశు సంక్షేమ శాఖ రీజనల్ కార్యాలయానికి వినియోగిస్తున్నారు. గతంలో ఇక్కడ ఖాళీ స్థలంలో కూరగాయల పంటలతో పాటు వివిధ రకాల పూల మొక్కలతో పచ్చదనం ఉండేది. ఈ స్థలంలో నిర్మాణాలు జరగడంతో పచ్చదనానికి కూడా గండిపడింది. మహిళా ప్రాంగణంపై అధికారుల చూపుతున్న నిర్లక్ష్యమే దీనికి కారణమని స్థానికులు అంటున్నారు. ఈ కేంద్రానికి పూర్వ వైభవం తేవాలని కోరుతున్నారు.

తోటగరువు పాఠశాల హెచ్‌ఎం ఉద్యోగ విరమణ


ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం విశ్వనాధం దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఆరిలోవ: తోటగరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వుట్ల విశ్వనాధం సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆయనకు ఉపాధ్యాయులు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. విశ్వనాధం దంపతులను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పాఠశాలలో ఆయన అందించిన సేవలను ఉపాధ్యాయులు కొనియాడారు. విశ్వనాధం మాస్టారు 42 ఏళ్ల పాటు ఉపాధ్యాయ వృత్తిలో సేవలందించారు. తోటగరువు ప్రాథమిక పాఠశాలలో 2009 నుంచి 2017 వరకు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా సేవలందించి బదిలీపై వేరే ప్రాంతం పాఠశాలకు వెళ్లారు. తిరిగి ఇదే పాఠశాలకు 2020లో ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతిపై వచ్చి ఐదేళ్లు పనిచేసిన సోమవారం ఉద్యోగ విరమణ పొందారు.

పేరుకుపోయిన చెత్త


లక్ష్మీనగర్ రోడ్డులోని డంపర్ బిన్ వద్ద చెత్తను తింటున్న పశువులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెం శివాజీ పార్కు మెయిన్ రోడ్డులోని లక్ష్మీనగర్ వద్ద గల డంపర్ బిన్ చెత్తాచెదారంతో నిండిపోయింది. పశువులు, కుక్కలు అక్కడి చేరి చెత్తను చెల్లాచెదురు చేస్తున్నాయి. డంపర్ బిన్‌లోని వ్యర్థాలను సోమవారం రాత్రి ఆవులు, గేదెలు లాక్కొని తినడంతో రోడ్డుపైకి చెత్త చేరింది. కుక్కలు అక్కడ సంచరిస్తుండటంతో అటుగా వెళ్లాలంటే పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు భయపడుతున్నారు. డంపర్ బిన్‌లో చెత్తను ఎప్పటిప్పుడు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

తాగునీరు వృథా


హెచ్‌బీ కాలనీలో పైప్‌లైన్ వాల్వ్ లీకై వృథాగా పోతున్న మంచినీరు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు హెచ్‌బీ కాలనీలోని సన్ స్కూల్ సమీపంలో తాగునీటి పైప్‌లైన్లకు ఉండే వాల్వ్‌లు లీకవుతుండటంతో నీరు వృథాగా పోతోంది. వాల్వ్‌లు మరమ్మతులకు గురవ్వడంతో మంచినీరంతా రోడ్డు పాలవుతోంది. రెండు రోజుల పాటు నీటి సరఫరా సిబ్బంది సమ్మె చేయడంతో కుళాయిలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న పాత వెంకోజిపాలెం వాసులు.. ఇలా వృథాగా మంచినీరు రోడ్డుపై ప్రవహించడాన్ని చూసి సిబ్బంది నిర్లక్ష్యంపై మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు పర్యవేక్షించి వాల్వ్‌కు మరమ్మతులు చేపట్టి, మంచినీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందికి సన్మానం


సిబ్బందిని సన్మానిస్తున్న వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రమేష్

విశాఖ సిటీ : వీఎంఆర్‌డీఏలో సుదీర్ఘ కాలం విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన నలుగురు సిబ్బందిని సంస్థ అధికారులు సోమవారం ఘనంగా సన్మానించారు. సిబ్బంది టి.సత్యనారాయణ, పి.శ్రీనివాసరావు, పి.తవిటయ్య, చిన్నారావులు సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రమేష్ మాట్లాడుతూ సుమారు 40 ఏళ్లపాటు వివిధ హోదాల్లో పనిచేస్తూ అందరి మన్ననలను పొందడం గొప్ప విషయమన్నారు. అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్న వీరి అనుభవాలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్టేట్ అధికారి దయానిధి, ఎస్‌ఈ భవానీ శంకర్, డీఎఫ్‌ఓ సుజాత శివాని, ఈఈలు ఎస్.వి.ఎస్.ఎన్.రాజు, జేసీపీ సింగ్, డీఈఈ రవిశంకర్, పరిపాలన అధికారులు రాజశేఖర్, రమణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గాంధేయవాది రావిప్రోలు


రావిప్రోలు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్ తదితరులు

సీతంపేట: స్థానిక బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో సోమవారం గాంధేయవాది డాక్టర్ రావిప్రోలు సుబ్రహ్మణ్యం సంస్మరణ సభ జరిగింది. ముఖ్య అతిథి గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ రావిప్రోలు చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావిప్రోలు గొప్ప గాంధేయవాదని, 75 ఏళ్ల వయసులో గాంధీజీపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పొందారని గుర్తుచేశారు. నరవ ప్రకాశరావు, డి.వి.సూర్యారావు, మేడా మస్తాన్‌రెడ్డి, ద్విభాష్యం రాజేశ్వరరావు, కె.వి.ఎస్.మూర్తి, సిహెచ్.చినసూర్యనారాయణ పాల్గొన్నారు.

విపత్తు నిర్వహణపై ముగిసిన శిక్షణ


సిబ్బందికి బహుమతి అందజేస్తున్న కమాండెంట్ పద్మనాభరాజు

పీఎం పాలెం: విపత్తులు సంభవించినప్పుడు ప్రజలకు రక్షణగా పోలీస్ యంత్రాంగం నిలుస్తుందని బక్కన్నపాలెం ఏపీఎస్‌పీ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు అన్నారు. విపత్తు వేళ ప్రజల రక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, పోలీసుల విధులపై బెటాలియన్‌లో నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా పద్మనాభరాజు మాట్లాడుతూ విపత్తుల నుంచి ప్రజలను కాపాడడంలో పోలీస్ యంత్రాంగం కీలక పాత్ర వహిస్తుందన్నారు. వరదల సమయంలో బోట్ల ప్రాధాన్యత, వాటి నిర్వహణకు సంబంధించిన అంశాలు వివరించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా శిక్షణలో ప్రతిభ కనబరచిన సిబ్బందికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ పి.సత్యం, అసిస్టెంట్ కమాండెంట్లు మురళీధర్, రామకృష్ణ, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్ రహదారిలో అంధకారం


విమ్స్ గేటు నుంచి హనుమంతవాక వైపు అంధకారంలో బీఆర్‌టీఎస్ రోడ్డు


పెదగదిలి వైపు చీకటిమయమైన బీఆర్‌టీఎస్ రహదారి

- సక్రమంగా వెలగని విద్యుత్ లైట్లు
- రాత్రుళ్లు వాహన చోదకుల అవస్థలు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రహదారిలో కొన్నాళ్లుగా అంధకారం నెలకొంది. దీనిపై ఏ లైన్‌లోనూ విద్యుత్ దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రిళ్లు చీకటిమయమవుతోంది. ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్న వాహనాలకు వాటి లైట్లే ఆధారమవుతున్నాయి. హనుమంతవాక కూడలి నుంచి అడవివరం వరకు ఐదు లైన్ల బీఆర్‌టీఎస్ రోడ్డు విశాలమైంది. దీనిలోని అన్ని లైన్లలో విద్యుత్ దీపాలు అమర్చారు. కొన్ని నెలలుగా పలుచోట్ల లైట్లు మొరాయించాయి. హనుమంతవాక నుంచి పెదగదిలి కూడలి వరకు పూర్తిగా ఏ లైన్‌లోనూ దీపాలు వెలగలేదు. దీన్‌దయాల్‌పురం నుంచి రామకృష్ణాపురం కూడలి, పైనాపిల్ కాలనీ నుంచి అడవివరం కూడలి వరకు ఎక్కువ సంఖ్యలో లైట్లు పాడయ్యాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో రాత్రి 7 గంటలు దాటితే వాహనాల లైట్లే రాకపోకలకు ఆధారంగా మారాయి. వాహన చోదకులు రాత్రిళ్లు చీకటిలో ఇబ్బంది పడుతున్నారు. మరో వారంలో సింహాచలం శ్రీవరాహి నృసింహ స్వామి గిరిప్రదక్షిణ జరగనుంది. లక్షల మంది భక్తులు గిరిప్రదక్షిణలో ప్రతి ఏడాది పాల్గొంటున్నారు. వారిలో సగానికి పైగా రాత్రి సమయంలోనే ఈ రోడ్డుపై నడుస్తుంటారు. బీఆర్‌టీఎస్ రోడ్డులో విద్యుత్ లైట్లు వెలిగించకపోతే గిరి ప్రదక్షిణ చేసే భక్తులకు చీకట్లు తప్పవని స్థానికులు అంటున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి వెంటనే ఈ మార్గంలో లైట్లు బాగుచేయించి వెలిగించాలని కోరుతున్నారు.

కరుణించే కనకదుర్గ

- ఇసుకతోటలో ఏళ్ల కిందట అమ్మవారి రాతి ప్రతిమ ప్రతిష్ట
- పూర్వీకుల నమ్మకాన్ని కొనసాగిస్తూ గ్రామస్తుల పూజలు
- అంచెలంచెలుగా ఆలయ అభివృద్ధి
- 6 నుంచి 8 వరకు ఉత్సవాలు


ఇసుకతోట వీధిలోని సతకంపట్టు ఆలయం (అమ్మవారి పుట్టినిల్లు)


ఇసుకతోట హైవేలో కొలువైన కనకదుర్గ

మద్దిలపాలెం: సుమారు 86 ఏళ్ల కిందట ఇసుకతోటలోని పూర్వీకులు డైయిరీఫారం వద్ద జాతీయ రహదారి పక్కనున్న ఆలయం నుంచి చిన్నరాతిని తమ గ్రామంలోకి తీసుకొచ్చారు. నాటి నుంచి గ్రామస్తులంతా ఆ రాతిని ఒక అమ్మవారిలా పూజిస్తూ వచ్చారు. పూర్వీకుల ఆలోచనను గౌరవిస్తూ గ్రామస్తులంతా ఆ రాతిని భక్తిశ్రద్ధలతో కొలవడమే కాకుండా దానిని అభివృద్ధి చేసుకుంటూ వచ్చారు. సుమారు 25 ఏళ్ల కిందట కనకదుర్గ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆలయం నిర్మించారు. అప్పటి నుంచి ప్రతి ఏటా ఆషాఢ మాసంలో అమ్మవారి ఉత్సవాలను గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. గ్రామంలో గవర కుల స్థులంతా తమ ఆరాధ్య దైవంగా అమ్మవారిని పూజిస్తున్నారు. అమ్మవారిని తీసుకొచ్చి ఉంచిన స్థలానికి సతకం పట్టుగా పేరుపెట్టి ప్రతి ఏటా అక్కడ తొలుత పూజలు చేసి, అక్కడి నుంచి జాతీయ రహదారి పక్కన్న నిర్మించిన ఆలయానికి ఊరేగింపుగా తీసుకువెళ్లి జాతర కొనసాగిస్తున్నారు. తమ పూర్వీకులు ఏర్పర్చిన నమ్మకంతో గ్రామస్తులంతా ఆలయాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేశారు.

6 నుంచి జాతర మహోత్సవాలు

ఈ నెల 6వ తేదీ నుంచి మూడు రోజుల పాటు కనకదుర్గ అమ్మవారి జాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు శ్రీ సీతారామ సేవా మండలి అధ్యక్షుడు కోరికిల్లి త్రినాథ్ శివ సత్యబాబు తెలిపారు. ఈ మేరకు వీధులన్నింటినీ మిరిమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో అలంకరిస్తున్నారు. 6వ తేదీన చాటింపు, 7న తొలేళ్ల సంబరం, 8న అమ్మవారి జాతర అనుపు ఉత్సవం జరుపనున్నట్టు గోవిందరాజు పేర్కొన్నారు. అనుపు ఉత్సవాన్ని పురస్కరించుకొని ఆ రోజు ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేస్తామన్నారు. గ్రామంలోనే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు సమర్పిస్తారని చెప్పారు. భక్తులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సాయంత్రం అమ్మవారి శతకం పట్టు నుంచి అమ్మవారిని ఊరేగింపుగా కనకదుర్గ ఆలయానికి మేళతాళాలు, డప్పుల వాయిద్యాల, సంప్రదాయ నృత్యాల నడుమ తీసుకొస్తామని, దీనికి తగ్గట్టు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

పెన్షన్ భిక్ష కాదు.. హక్కు


డీఆర్‌ఎం కార్యాలయం వద్ద మానవ హారం నిర్వహిస్తున్న రైల్వే పెన్షనర్లు

తాటిచెట్లపాలెం: పెన్షన్ భిక్ష కాదని.. అది ఉద్యోగుల హక్కని రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ల ప్రతినిధులు పేర్కొన్నారు. రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్(ఆర్పీఏ), రైల్వే పెన్షనర్స్ ఫెడరేషన్(ఆర్పీఎఫ్), రిటైర్డ్ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్(ఆర్‌ఆర్‌ఈఏ), లోకో పైలట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో సోమవారం దొండపర్తిలోని డీఆర్‌ఎం కార్యాలయం చుట్టూ పెద్ద ఎత్తున మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షన్ సవరణ క్లాజ్ పేరుతో 2025–26 బడ్జెట్‌లో బిల్లును పాస్ చేసి, రాష్ట్రపతి ఆమోద ముద్రతో దాన్ని చట్టంగా చేశారని, దీని ప్రకారం ఇంతవరకు ఉద్యోగి హక్కుగా ఉన్న పెన్షన్‌ను కాలరాస్తూ, ప్రభుత్వ దయాదాక్షిణ్యంగాను, భిక్షగాను మార్చేసిందని ఆరోపించారు. పెన్షన్ ఉద్యోగి హక్కని సుప్రీం కోర్టు కూడా తెలియజేసిందని, కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని, చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌ఎం కార్యాలయంలో మెమోరాండం సమర్పించారు. కార్యక్రమంలో రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.కొండలరావు, కార్యదర్శి వేగి నాగేశ్వరరావు, రైల్వే పెన్షనర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎంఆర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ కె.వి.నరసింగరావు, రిటైర్డ్ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.వి.శేషాద్రి, కార్యదర్శి వేదుల నరసింగరావు, రైల్వే లోకో పైలట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.వి.రమణ, కార్యదర్శి కె.కె.రావు, అధిక సంఖ్యలో ఆయా యూనియన్‌లకు చెందిన సభ్యులు, రిటైర్డ్ రైల్వే ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

నివాసాల మధ్య వ్యర్థాల నిల్వలు

ఇబ్బందులు పడుతున్న స్థానికులు


ఇసుకతోట పాఠశాల సమీపంలోని ఇళ్ల మధ్య వ్యర్థ వస్తువుల నిల్వలు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు ఇసుకతోట ప్రాథమిక పాఠశాల సమీపంలోని నివాస గృహాల మధ్య వ్యర్థ వస్తువుల నిల్వలు పేరుకుపోతున్నాయి. వీధుల్లో వ్యర్థ పదార్థాలను సేకరించుకుని వచ్చే వారు ఇక్కడే గంజాయి సేవించడం, చెత్త నిల్వలను రోడ్డుపైనే ఉంచడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడికి వచ్చే దుండగులు వీధి లైట్లను పగులగొట్టి అసాంఘిక కార్యకలాపాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారని చెబుతున్నారు. పగలంతా తమ తమ విధుల్లోకి వెళ్లి శ్రమించి వస్తున్న తమకు రాత్రి పూట వ్యర్థ వస్తువుల నిల్వల వారు శబ్దాలు చేస్తూ ఇబ్బంది కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై లేఖ ద్వారా జీవీఎంసీ జోన్–3 కమిషనర్ శివప్రసాద్‌కు ఫిర్యాదు చేసినట్లు స్థానికులు తెలిపారు. వెంటనే తమ ప్రాంతంలో ఇటువంటి వ్యర్థ వస్తువుల సేకరణ, నిల్వలను తొలగించాలని కోరుతున్నారు. ఇక్కడ రాత్రి పూట గంజాయి, మద్యం సేవించే వారు పెరిగిపోయారని, రాత్రి వేళ పోలీస్ బీట్ బృందం నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

ఎంవీపీకాలనీ: గుడుపు శ్రీకాంత్(31) అనే వ్యక్తి అనుమానాస్పద మృతిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటున్న శ్రీకాంత్ రెండేళ్లుగా జ్యోతి అనే మహిళతో కలిసి అచ్యుతాపురంలో ఉంటున్నాడు. మద్దిలపాలెం చైతన్యనగర్‌లో శ్రీకాంత్ నివసిస్తున్నట్లు ఇటీవల బంధువు ద్వారా అతడి తల్లిదండ్రులకు తెలిసింది. శ్రీకాంత్ ఉరివేసుకొని మృతిచెందినట్లు గత నెల 29న తండ్రి నాగరాజుతోపాటు కుటుంబ సభ్యులకు ఫోన్ వచ్చింది. దీంతో హుటాహుటీన మద్దిలపాలెం చేరుకున్న కుటుంబ సభ్యులు అతడి మృతిపై ఆరా తీయగా.. కొంత కాలంగా జ్యోతికి శ్రీకాంత్‌కు గొడవలు జరుగుతున్నట్లు తెలిసింది. కొంతకాలంగా అతడు ప్లంబింగ్ పనులకు వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. ఉరివేసుకున్న సమయంలో జ్యోతి ఇంట్లోనే ఉండగా.. బయట దుస్తులు ఉతుకుతున్నట్లు ఆమె వెల్లడించింది. తరువాత గది కిటికీ తీసి చూడగా.. శ్రీకాంత్ ఉరివేసుకున్నట్లు గమనించి పక్కవారిని పిలిచి కిందకి దించినట్లు పేర్కొంది. ఈ వ్యవహారమంతా అనుమానాస్పదంగా ఉందంటూ శ్రీకాంత్ తండ్రి నాగరాజు ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు నైపుణ్యం పెంచుకోవాలి


ఆన్‌లైన్ ద్వారా వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులతో మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

- జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్
- కర్మయోగి పోర్టల్‌పై శిక్షణ

మహారాణిపేట: కర్మ యోగి డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫాం ద్వారా ప్రతి ప్రభుత్వ ఉద్యోగి నైపుణ్యం, సామర్థ్యం పెంచుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ కోరారు. విజయవాడ ఏపీ ఎస్‌డీపీఎస్ నుంచి జిల్లా అధికారులకు కర్మయోగి పోర్టల్‌పై ఆన్‌లైన్ ద్వారా ఇచ్చిన శిక్షణ అనంతరం ఆయన మాట్లాడారు. టెక్నాలజీకి అనుగుణంగా పని చేసేందుకు కర్మయోగి పోర్టల్‌ను ఏర్పాటు చేశారని, దీనిలో 10 కోర్సులు ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలో ఉంచారని తెలిపారు. ఉద్యోగులంతా యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకుని, వారంలోగా మూడు కోర్సులు నేర్చుకోవాలని.. ఆన్‌లైన్ సర్టిఫికెట్ పొంది జిల్లాను ముందంజలో ఉంచాలని కోరారు. క్రమంగా మిగిలిన కోర్సులు పూర్తి చేయాలని సూచించారు. జిల్లా అధికారులు తమ కార్యాలయ పరిధిలో ఉద్యోగులు కోర్సులు పూర్తి చేసేలా పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.